క్లుప్తంగా

ప్రణాళికాబద్ధంగా చదవాలి..



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీడీ రామానందం

బొండపల్లి: పదో తరగతి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని సాంఘిక సంక్షేమ శాఖ డీడీ బోని రామానందం ఆకాంక్షించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని, బాగా చదువుకోవాలని సూచించారు. ఇప్పటికే విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఓ టి.సత్యనారాయణ, వసతిగృహ సంక్షేమాధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



గుడివాడలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ సూర్యనారాయణ

వేపాడ: మండలంలోని గుడివాడలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ సూర్యనారాయణ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారులకు పలు సూచనలు చేశారు. ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తే వేతనం గిట్టుబాటు అవుతుందన్నారు.

☛ పింఛన్ల పంపిణీ పరిశీలన..

మండలంలోని జాకేరు, సోంపురం గ్రామాల్లో పింఛన్ల పంపిణీని ఎంపీడీఓ సూర్యనారాయణ పరిశీలించారు. ఎంతమందికి పింఛన్లు అందజేసినదీ ఆరా తీశారు.

వైద్యాధికారికి సన్మానం



డాక్టర్ ధరణిని సన్మానిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

వేపాడ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఏ.ధరణిని ఆస్పత్రి సిబ్బంది శనివారం సన్మానించారు. ఉత్తమ వైద్యాధికారిగా గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చేతుల మీదుగా అవార్డు అందు కున్న నేపథ్యంలో ఆమెను సత్కరించారు. సీహెచ్‌ఓ ఆంజనేయులు, యూడీసీ శ్రీనివాస్, ఫార్మసిస్టు రామ లక్ష్మం, సూపర్‌వైజర్ వి.వి.రమణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులకు బూట్లు పంపిణీ



విద్యార్థులకు బూట్లు అందజేస్తున్న శ్రీరామ ట్రస్టు ప్రధాన కార్యదర్శి మధురవాణి, హెచ్‌ఎం శారద

లక్కవరపుకోట: గంగుబూడి ఉన్నత పాఠశాలలో చదువుతున్న 100మంది విద్యార్థులకు శ్రీరాంపురం గ్రామానికి చెందిన శ్రీరామ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం బూట్లు పంపిణీ చేశారు. ట్రస్టు ప్రధాన కార్యదర్శి వి.మధుర వాణికి హెచ్‌ఎం శారద కృతజ్ఞతలు తెలిపారు. మధురవాణి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల విద్యాభివృద్ధికి ట్రస్టు తరఫున సహాయ, సహకారం అందిస్తున్నామన్నారు.పాఠశాల ఉపాధ్యాయులు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

చీపురుపల్లి ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా నర్సింహులు



నర్సింహులు

మెరకముడిదాం: చీపురుపల్లి నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా గర్భాం గ్రామానికి చెందిన దేవుపల్లి నర్సింహులను ఆసంఘం రాష్ట్ర కార్యవర్గం శనివారం నియమించింది. ఈసందర్భంగా ఆయన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర, జిల్లా కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. తనను నమ్మి నియోజకవర్గ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వం అంచనాలను వమ్ము చేయకుండా మాదిగలను ఐక్యం చేయడంలో, సేవా కార్యక్రమాల్లో మరింత చురుగ్గా పాల్గొంటానని చెప్పారు.

రథసప్తమి వేడుకలకు సిద్ధం



సూర్యనారాయణ మూర్తి స్వామి

మెరకముడిదాం: మండలంలోని సోమలింగాపురం శ్రీసూర్యనారాయణస్వామి ఆలయంలో ఈనెల 4వ తేదీన రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్.వి.రమణరాజు, అతని సోదరుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఆలయం రాష్ట్రంలో అరసవెల్లి సూర్యనారాయణమూర్తి స్వామివారి ఆలయం తర్వాత అంతటి పేరుగాంచింది. రథసప్తమి రోజున స్వామివారికి ప్రత్యేకపూజలతో పాటు క్షీరాభిషేకం నిర్వహించనున్నారు.

మూలకు చేరుతున్న కియోస్క్‌లు

- ఆర్‌ఎస్‌కేల్లో కియోస్క్ సేవలకు మంగళం
- గత ప్రభుత్వంలో రైతులకు కియోస్క్ ద్వారా అందిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు
- ప్రస్తుతం నిలిచిపోయిన సేవలు

నియోజకవర్గంలో మండలాలవారీగా రైతుసేవా కేంద్రాలు, కియోస్క్ యంత్రాల వివరాలు...

మండలం	రైతు సేవా కేంద్రాలు	కియోస్క్ యంత్రాలు
చీపురుపల్లి	14	14
గరివిడి	21	21
మెరకముడిదాం	18	18
గుర్ల	24	24



చీపురుపల్లి మండలంలోని నిమ్మలవలసలో కియోస్క్ యంత్రాన్ని వినియోగిస్తున్న రైతు(ఫైల్)



గుర్ల మండలంలోని తెట్టంగిలో మూలకు చేరిన కియోస్క్ యంత్రం

చీపురుపల్లి: సాధారణంగా ప్రభుత్వాలు మారి కొత్త ప్రభుత్వాలు కొలువుదీరినప్పుడు సరికొత్త సేవలను అమల్లోకి తీసుకురావడం చూస్తుంటాం. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం మాత్రం కొత్త సేవలు అందించకపోగా ఉన్న సేవలకు మంగళం పాడుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టి వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది. పెట్టుబడి సాయం నుంచి పంటల సాగు, ఎరువుల సరఫరా, మార్కెటింగ్ వరకు అన్ని విధాలా సహాయ, సహకారాలు అందిస్తూ అండగా నిలిచింది. వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల్లో ఉత్పాదకతను పెంపొందిస్తూ రైతుల ఆర్థికాభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ప్రతీ సచివాల యం పరిధిలోనూ రైతుభరోసా కేంద్రాల(ఆర్బీకే)ను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో కియోస్క్(డిజిటల్ టచ్ స్క్రీన్)యంత్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఇళ్ల వద్దకే విత్తనా లు, ఎరువులు, పురుగు మందులు అందించేలా డిజిటల్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నంత కాలం రైతులకు చక్కని సేవలం దించిన కియోస్క్ యంత్రాలు ప్రస్తుతం వినియోగించకపోవడంతో దాదాపు మూలకు చేరిపోయాయి. కూటమి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల పేరును రైతు సేవా కేంద్రాలు(ఆర్‌ఎస్‌కే)గా మార్చిందే కానీ వాటిలో కొత్తగా సేవలేవీ అందుబాటులోకి తీసుకురాకపోగా...ఉన్న సేవలకు సైతం మంగళం పాడుతూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తోంది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కోసం ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చి ఆచరణలో పెడితే ప్రస్తుత ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేస్తోందనే విమర్శలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి.

ఆన్‌లైన్‌లో ఆర్డర్..

గత ప్రభుత్వంలో ఆర్బీకేల్లో ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రాల ద్వారా రైతులు తమకు కావాల్సిన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసుకునే వారు. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ చేసుకునేందుకు వివిధ ప్రాంతాల్లో ఉన్న ధరల వివరాలను, పంటల సాగు యాజమాన్య పద్ధతులకు సంబంధించిన సంక్షిప్త వీడియోలు, వాతావరణ సమాచారం, ఏ సమయంలో ఏ పంటలు సాగు చేయాలనే వివరాలను వీటి ద్వారా తెలుసుకునే వారు. కియోస్క్‌లో రైతులు తమ ఆధార్, ఫోన్ నంబర్‌ను నమోదు చేసిన తర్వాత డిజిటల్ సేవలు ప్రారంభమయ్యేవి.తమకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల వివరాలను రిజిస్టర్ చేసుకునే వారు. రిజిస్టర్ అయిన తర్వాత మొబైల్‌కు ఓటీపీ వచ్చేది.అక్కడే ఫోన్ పే, లేదా క్యూఆర్ కోడ్ ఆప్షన్ ద్వారా ఆన్‌లైన్ పేమెంట్ పూర్తి చేసేవారు. ఈ ప్రక్రియ ముగిసిన 48 నుంచి 72 గంటల్లోగా వారు ఆర్డర్ చేసుకున్న ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు ఆర్బీకేల కు చేరగానే రైతుల ఫోన్‌లకు మెసేజ్ వచ్చేది. వెంటనే రైతులు ఆర్బీకేలకు వెళ్లి వాటిని తీసుకువెళ్లేవారు. ఇప్పుడు ఈ సేవలేవీ అందడం లేదు. నియోజకవర్గం లోని చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండలాల్లోని ఆర్బీకేల్లో దాదాపు కియోస్క్ యంత్రాలు మూలకు చేరాయి. చీపురుపల్లి మండలంలోని నిమ్మలవలస, కరకాం, గరివిడి మండలంలో వెదుల్లవలస, రేగటి, దువ్వాం, కోడూరు, మెరకముడిదాం మండలంలోని సాతంవలస, ఊటపల్లి, గర్భాం-1, 2, రామాయవలస, చెల్లాపురం, గుర్ల మండలంలో చింతలపేట, నడుపూరు, పకీరుకిత్తలి, పల్లిగండ్రేడు, పెనుబర్తి, తెట్టంగి, వల్లాపురం తదితర రైతుభరోసా కేంద్రాల్లో కియోస్క్‌లు పూర్తిగా పని చేయడం లేదని అక్కడి రైతులు చెబుతున్నారు.

ప్రజాసమస్యలపై పోరాడదాం



నాయకులతో సమావేశమైన శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ

- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన శాసన మండలిలో విపక్షనేత బొత్స

చీపురుపల్లిరూరల్(గరివిడి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే ప్రజాసమస్యలపై పోరాడదామని శాసన మండలిలో విపక్షనేత బొత్స సత్యనారాయణ వైఎస్సార్‌సీపీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. గరివిడి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో చీపురుపల్లి నియోజకవర్గంలోని గరివిడి, చీపురుపల్లి, మెర కముడిదాం, గుర్ల మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులతో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ ఇకపై ప్రతీ మండలంలో వారానికి ఒకసారి పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించుకుందామని చెప్పారు. చీపురుపల్లి,గరివిడి మండలాల నాయకులతో ఒక వారంలో గరివిడి పార్టీ కార్యాలయంలో, మరోవారం గుర్ల మండలం, తర్వాత మెరకముడిదాం నాయకులతో ఆయా మండలాల్లో సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశాల్లో చర్చించి, వాటి పరిష్కారం కోసం ప్రజలకు మద్దతుగా అంతా కలిసి పోరాడదామన్నారు.

రైతులు నష్టపోకూడదు...

గరివిడి మండలంలోని దేవాడ గ్రామానికి చెందిన నాయకులు, కొంతమంది రైతులు తోటపల్లి కాలువ సమస్యను బొత్స దృష్టికి తీసుకువచ్చారు. గతంలో నిర్మాణం చేపట్టిన తోటపల్లి కాలువ దేవాడలో మైనింగ్ ప్రాంతం పరిధిలో ఉందని, మైనింగ్ పనులకు ఇబ్బందులు లేకుండా తమ భూముల్లోంచి తోటపల్లి కాలువ తవ్వేందుకు సన్నాహాలు చేస్తున్నారని, ఇలా జరిగితే తామంతా నష్టపోవాల్సి వస్తుందని రైతులు తమ సమస్యను బొత్సకు వివరించారు. బొత్స స్పందిస్తూ ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రైతుల భూముల్లోంచి తోటపల్లి కాలువ నిర్మాణాలు జరిగితే 30 ఎకరాల ఆయకట్టును నష్టపోతారని, ఈ విధానం ఎంతమాత్రం సరి కాదని, రైతులకు, మైనింగ్‌కు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, సీనియర్ నాయకులు కె.వి.సూర్యనారాయణరాజు, గరివిడి,గుర్ల జెడ్పీటీసీలు వాకాడ శ్రీనివాసరావు, సీర అప్పలనాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ గరివిడి మండల అధ్యక్షుడు కొణిశ కృష్ణంనాయుడు, చీపురుపల్లి మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు, మాజీ జెడ్పీటీసీ మీసాల వరహాలనాయుడు, గుర్ల మండల నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, తోట తిరుపతిరావు, మెరకముడిదాం మండల నాయకులు తాడ్డి వేణుగోపాలరావు,కోట్ల విశ్వేశ్వరరావు, నాలుగు మండలాల సర్పంచులు,ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహప్రతిష్ఠోత్సవ పూజలు



చీపురుపల్లి పట్టణంలోని శెగిడివీధిలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున సమేతా సీతారామలక్ష్మణ హనుమత్ ఆలయంలో శ్రీశయన సేవా సంఘం ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. జ్యోతిష్య శ్రీ భోగాపురం వాయునందనశర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. – చీపురుపల్లి

రోడ్డు కోసం రాస్తారోకో

ఆతవ గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలంటూ ఆ గ్రామస్తులు చేస్తున్న నిరసన కార్యక్రమాలు ఆరో రోజు శనివారం కొనసాగాయి. సీపీఎం నాయకుడు చల్లా జగన్ ఆధ్వర్యంలో వేపాడ-సోంపురం రోడ్డులో రాస్తారోకో చేశారు. ఈసందర్భంగా జగన్ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వం మంజూరు చేసిన నాబార్డు నిధులు రూ.1.28 కోట్లు ఉన్నప్పటికీ పనులు చేయించేందుకు అధికారులు ఎందుకు వెనుకడుగు వేస్తున్నారో ప్రజలకు చెప్పాలన్నా రు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దళిత సంఘాల నేతలు ఆతవ ఉదయ్‌భాస్కర్, కర్రి దేముడు, నాగరాజు, గొంప సన్నిబాబు, గొంప సతీష్,దప్పురాజు పాల్గొన్నారు – వేపాడ



విజ్ఞాన యాత్ర



గంట్యాడ మండలంలోని మదనాపురం మోడల్ స్కూల్‌లో ఇంటర్మీయట్ మొదటి, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ప్రిన్సిపాల్ ఆర్.రామకృష్ణా రావు ఆధ్వర్యంలో శనివారం విజ్ఞానయాత్రకు వెళ్లారు. మండలంలోని నరవ వద్ద ఉన్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఐటీఐ కళాశాలను సంద ర్శించారు. కళాశాలలో ఫిట్టర్, ఎలక్ట్రికల్, డీజిల్ తదితర విభాగాల్లో ఇస్తున్న శిక్షణ గురించి అక్కడి సిబ్బంది పాఠశాల విద్యార్థులకు వివరించారు. మోడల్‌స్కూల్ ఒకేషనల్ ట్రైనర్ బి. వెంకటలక్ష్మి, గణిత ఉపాధ్యాయుడు బాబు తదితరులు పాల్గొన్నారు. – గంట్యాడ

గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేద్దాం..

- వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల సమావేశంలో మాజీ ఎంపీ బెల్లాన, మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య



నియోజకవర్గ స్థాయి వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులతో మాజీ ఎంపీ చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గజపతినగరం: వైఎస్సార్‌సీపీ గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు పార్టీ కార్యకర్తలు, నాయకులు అంతా కలిసికట్టుగా కృషి చేయాలని విజయనగరం మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్,గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. వైఎస్సార్‌సీపీలో వివిధ అనుబంధ విభాగాలకు నియోజకవర్గంలో నూతనంగా నియమితులైన అధ్యక్షులు, పార్టీ నాయకులతో స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కావొస్తోందని, పథకాల అమలుతో పాటు ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రభుత్వ వైఫల్యాన్ని, చేసిన మోసాన్ని ప్రజలకు వివరిద్దామన్నారు. పోరాటాలతో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరముందన్నారు. పార్టీ విభాగాల నూతన అధ్యక్షులు ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులను సమన్వ యం చేసుకుంటూ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి సూచించిన బా ధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యుల ఆధ్వర్యంలో గ్రామాల్లో జరగాలిన్న పనులను కొన్నిచోట్ల టీడీపీ కార్యకర్తలు చేస్తున్నారని, అటువంటి వాటికి అడ్డుకట్ట వేయాలని, అవసరమైతే లోకాయుక్తకు వెళదామన్నారు.కొద్ది రోజుల్లో పార్టీ మండల, జిల్లాస్థాయి యువజన కమిటీలను నియమించనున్నట్లు పేర్కొన్నారు.

రైతు సమస్యలపై పోరాటం

పార్టీ నాయకులతో సమావేశం అనంతరం మాజీ ఎంపీ బెల్లాన, మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య విలేకరులతో మాట్లాడారు. రైతులకు విత్తనాలు,ఎరువులు సకాలంలో అందడం లేదని, ధాన్యం విక్రయం చుకునేందుకు రైతులు పడుతున్న ఇబ్బందులతో పాటు బిల్లులు చెల్లించకపోవడంపై పోరాటం చేస్తామన్నారు. దేశంలో ఎప్పుడూ లేనివిధంగా గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి 17 మెడికల్ కళాశాలలను తీసుకొచ్చి చరిత్ర సృష్టిస్తే... సీఎం చంద్రబాబు మాత్రం వాటిని ప్రైవేటుకు అప్పగించేస్తున్నారని మండిపడ్డారు. ఉపాధి హామీ పథకాన్ని కూటమి ప్రభుత్వం ఏటీఎం కార్డు గా ఉపయోగించు కుంటోందని, అధికార పార్టీ నాయకుల దోపిడీ తప్ప ఎక్కడా అభివృద్ధి లేదన్నారు. ఏ తప్పు చేయకపోయినా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలను ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించి, ఆ పోస్టులను టీడీపీ నాయకులు తమకు నచ్చిన వారికి అమ్ముకుంటున్నారని మండిపడ్డారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత సుమారు నాలుగు లక్షల మందికి పింఛన్‌లు తొలగించారని, ఇది ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. రాజధాని అమరాతి నిర్మాణం పేరుతో నారా లోకేష్ దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. సంపద సృష్టిస్తామని చెప్పిన సీఎం చంద్రబాబునాయుడు కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు కాకముందే లక్షా 12వేల కోట్ల రూపాయలు అప్పు చేశారని, ఆ డబ్బుతో ఏం చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలని నిలదీశారు. జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మెడికల్ ఇంజినీరింగ్ కాలేజీలు, పోర్టులు, గ్రామసచివాలయాలు, ఆర్బీకేలు, వెల్‌నెస్ సెంటర్‌లు, వంతెల నిర్మాణం, పాఠశాలల అభివృద్ధి వంటి అనేక కార్యక్రమాలు చేపట్టామని గుర్తు చేశారు. గజపతినగరం జెడ్పీటీసీ గార తవుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, పార్టీ సీనియర్ నాయకులు కరణం ఆదినారాయణ, నారాయణమూర్తి, సుబ్రహ్మణ్యం, దశరథ, జొన్నాడ వెంకటలక్ష్మి, కర్రి రాము నాయుడు, మిత్తిరెడ్డి రమేష్ నాయుడు పాల్గొన్నారు.

మంచు దుప్పటి

కొత్తవలస, ఎల్.కోట మండలాల్లోని పలుగ్రామాలను శనివారం ఉదయం మంచు దుప్పటి కప్పేసింది. ఉదయం 9 గంటల వరకు పొగమంచు కురుస్తునే ఉంది.రోడ్లపై రాకపోకలు సాగించే వాహనచోదకులు దారి కనిపించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. లైట్ల వెలుగులో రాకపోకలు సాగించాల్సి వచ్చింది.
– కొత్తవలస/లక్కవరపుకోట



కొత్తవలసలోని విశాఖ-అరకు రోడ్డులో దట్టంగా కురుస్తున్న మంచు



కొత్తవలసలోని విజయనగరం రోడ్డులో కురుస్తున్న మంచు



ఎల్.కోట మండలంలోని శ్రీరాంపురం గ్రామాన్ని కమ్మేసిన మంచు

చిత్తడి నేలల పరిరక్షణ సమష్టి బాధ్యత



మాట్లాడుతున్న జిల్లా ఉపవిద్యాశాఖ అధికారి మోహన్‌రావు

గజపతినగరం: భూమిపై ప్రాణికోటి మనుగడకు చిత్తడి నేలలే మూలమని, వాటి పరిరక్షణ ప్రజల సమష్టి బాధ్యతని విజయనగరం జిల్లా బొబ్బిలి డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి కె.మోహన్‌రావు అన్నారు. ఫిబ్రవరి 2న ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ఎస్‌జీసీ డైరెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని మరుపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి వనరులకు, మంచినీటికి మూలాలుగా ఉన్న చిత్తడి నేలలు భూమి ఉపరితలం నుంచి వ్యర్థాలను వడపోస్తాయని అన్నారు. సముద్రం,నదీ తీరప్రాంతాల్లో లోతు తక్కువగా ఉండి ఎక్కువ కాలం నీరు నిల్వ ఉండే భూములను చిత్తడి నేలలంటారని తెలిపారు. ఎంఈఓలు విమలమ్మ,సాయిచక్రధర్, హెచ్‌ఎం నాగమణి, ఎస్‌జీసీ కో-ఆర్డినేటర్ బి.వేణిగోపాలరావు, సూర్యకళ, తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడి మృతి

కొత్తవలస: స్థానిక మేజర్ పంచాయతీ శివారు 202 కాలనీలో నివాసం ఉంటున్న మండల పరిషత్ కో-ఆప్ష న్ సభ్యుడు ఎస్‌కే ఫిరోజ్‌ఖాన్(54)గుండెపోటుతో శుక్రవారం రాత్రి మృతిచెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. ఫిరోజ్‌ఖాన్ రాత్రి భోజనం చేసి నిద్రపోయే సమయంలో గుండెల్లో మంటగా ఉందని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. అయితే మార్గం మధ్యలోనే ఆయన మృతి చెందారు. ఎంపీపీ నీలంశెట్టి గోపమ్మ,మాజీ ఎంపీపీ గొరపల్లి శివ, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్యరామస్వామి, కొత్తవలస-1 ఎంపీటీసీ బోని లక్ష్మి ఫిరోజ్‌ఖాన్ భౌతికకాయాన్ని శనివారం సందర్శించి నివాళులర్పించారు.

పాడిరైతుల మహాధర్నా రేపు

బొండపల్లి: విశాఖ డెయిరీకి పాలు పోస్తున్న పాడి రైతుల సమస్యలను పరిష్కరించాలని కౌలురైతు సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి. పైడపునాయుడు, రాకోటి రాములు శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ వద్ద మహాధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పాడి రైతులకు బోనస్ ఇవ్వడంతో పాటు 50 శాతం రాయితీపై దాణా అందజేయాలని కోరారు. మహాధర్నాలో పాడిరైతులందరూ పాల్గొనాలని కోరారు.

హెల్మెట్ తప్పనిసరి

దత్తిరాజేరు: ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పెదమానాపురం ఎస్సై జయంతి అన్నారు. పెదమానాపురం సంత వద్ద శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహన చోదకులకు రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి అపరాధ రుసుం విధించారు.